క్లుప్తంగా

27న భూభారతిపై అవగాహన సదస్సు

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఈనెల 27న భూభారతి అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ రాజర్షిషా హాజరు కానున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సత్యసాయి ద్వారా సేవా కార్యక్రమాలు

ఆదిలాబాద్‌టౌన్: సత్యసాయి సేవ సమితి ట్రస్ట్ ద్వారా అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆ ట్రస్ట్ అధ్యక్షుడు నర్సింహారావు అన్నారు. గురువారం రిమ్స్ ఆవరణలోని సత్యసాయి నిత్యాన్నదన కేంద్రంలో సత్యసాయి ఆరాధన దినోత్సవాన్ని నిర్వహించారు. సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి హారతినిచ్చారు. ఆస్పత్రికి వచ్చిన రోగుల సహాయకులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం రాష్ట్ర కార్యదర్శి మల్లయ్య, ట్రస్ట్ సభ్యులు విలాస్, ఈశ్వర్ రెడ్డి, విజయ్ బాబు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మానసిక ప్రశాంతత


శివపురాణం బోధిస్తున్న శంకర్ మహరాజ్

ఇచ్చోడ: శివనామస్మరణతో మానసిక ప్రశాంతత లభిస్తుందని భీమా శంకర్ మహరాజ్ అన్నారు. గురువారం శివపురాణం ద్వారా భక్తులకు ఏర్పడే అనుభూతిని తెలియజేశారు. శివపురాణం మహోన్నతమైందన్నారు. వారం రోజుల పాటు భక్తిశ్రద్ధలతో విన్నవారికి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. శివుని మహిమలు చాలా గొప్పవని సూచించారు. శుక్రవారం శివపురాణం ముగింపు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ప్రజావాణిలో 25 వినతులు

బోథ్: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం ప్రజావాణి కార్యక్రమం అధికారులు నిర్వహించారు. ఎంపీడీవో రమేశ్ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. 25 వినతులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

నేడు ఉపాధి పనులపై గ్రామసభలు

తాంసి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా గతేడాది చేపట్టిన పనులపై పంచాయతీ కార్యాలయంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీవో విజయ తెలిపారు. గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులను సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఇప్పటికే తనిఖీ చేసి ఆడిట్ నిర్వహించారు. శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో ఉదయం 8 గంటల నుంచి గ్రామసభల ద్వారా చేపట్టిన పనుల వివరాలు, కూలీల వివరాలను తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు.

రెండు రోజులు జొన్న కొనుగోళ్లు బంద్

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో చేపడుతున్న జొన్న కొనుగోళ్లను ఈనెల 25, 26వ తేదీల్లో తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. మార్కెట్ యార్డులో పంట నిల్వలు పేరుకుపోవడంతో కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరిగి 28న కొనుగోళ్లు ప్రారంభమవుతాయని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులు అరెస్ట్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ సమీపంలో గురువారం సాయంత్రం గంజాయి వి క్రయిస్తున్న, కొనుగోలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఇచ్చోడ ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ముఖరా బి గ్రామానికి చెందిన జునైద్‌ఖాన్ గంజాయి కోసం మాన్కుగూడ గ్రామానికి చెందిన కు డిమేత జంగును సంప్రదించాడు. ఈక్రమంలో జంగు 200 గ్రాముల గంజాయిని మండల కేంద్రంలో ని అయ్యప్ప ఆలయం వద్ద జునైద్‌కు విక్రయిస్తుండగా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని ఇ ద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఉగ్రదాడి హేయమైన చర్య

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- జిల్లా వ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీ


నిరసన తెలుపుతున్న ముస్లింలు


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

నేరడిగొండ: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం హేయమైన చర్య అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఈ దాడిలో మృతి చెందిన 26 మంది ఆత్మకు శాంతి చేకూరాలని గురువారం రాత్రి మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానికులు, బీఆర్‌ఎస్ నాయకులతో మౌనం పాటిస్తూ.. నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: జమ్ముకశ్మీర్‌లో పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ.. గురువారం రాత్రి మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని అంజీ చౌక్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామపటేల్ మారుతి డొంగ్రె, ప్రముఖ వ్యాపారస్తులు చింతవార్ సంతోష్, కేశవ్ ముస్లే, ఎండీ మసుద్, మీర్జా జీలానిబేగ్, అంజాద్, సుఫీయన్, అనిల్ రాథోడ్ పాల్గొన్నారు.

సిరికొండ: ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ.. మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉగ్రదాడిలో అమయాకులు ప్రాణాలు విడిచారని, ఉగ్రవాదాన్ని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పెంటన్న, చందు, మల్లేష్, ప్రకాష్ పాల్గొన్నారు.


మౌనం పాటిస్తున్న నాయకులు

బోథ్: ఉగ్రవాదులు చేసిన దాడిని ముస్లింలు తీవ్రంగా ఖండించారు. గురువారం సాయంత్రం బోథ్ మండల కేంద్రంలో కొవ్వొత్తులతో గాంధీ చౌక్ నుంచి బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదులను భారతదేశం నుంచి తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం యువకులు పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: జమ్మూ కశ్మీర్‌లో తీవ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి యూత్ కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్‌లో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శాంతన్ రావు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అర్బాత్, పరమేశ్వర్, నాహిద్, బద్దం పోతారెడ్డి, సామ రూపేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఉగ్రవాదులు చేసిన దాడులకు నిరసనగా కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. పోలీస్‌స్టేషన్ నుంచి కుమరం భీం చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తాల మీదుగా శివాజీ చౌక్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో వీడీసీ, హిందు సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఇంద్రవెల్లిలో..


కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


ఒరిగిన విద్యుత్ స్తంభం



ఇంద్రవెల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అందునాయక్‌తండా గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కనే త్రీఫేజ్ విద్యుత్ స్తంభం ఒక వైపు ఒరిగి ప్రమాదకరంగా మారింది. చిన్న గాలి వీచిన విద్యుత్ స్తంభం రోడ్డుపై నేలకొరిగే అవకాశం ఉంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. – ఇంద్రవెల్లి

బాధిత కుటుంబాలకు చేయూత

- రాష్ట్ర ప్రత్యేక విపత్తు కింద రూ.4 లక్షల పరిహారం
- వడదెబ్బతో మృతి చెందిన కుటుంబానికి వర్తింపు



నేరడిగొండ: వేసవిలో ఎక్కువగా వడదెబ్బకు గురవుతుంటారు. అనేక మంది దీనిని గుర్తించలేక ప్రాణాలు కోల్పోతుంటారు. ఇలాంటి వారికి ప్రభుత్వం నష్ట పరిహారం ఇస్తుంది. వడదెబ్బతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. వడదెబ్బను రాష్ట్ర ప్రత్యేక విపత్తు కింద గుర్తించి పరిహారాన్ని పెంచుతున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఉష్ణోగ్రతల్లో పెరుగుదలను గుర్తించి కలెక్టర్లు వడదెబ్బ మరణాలపై నిర్ణయం తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు రూ.4లక్షల పరిహారం అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది.

పరిహారం పొందడం ఇలా..

ఉష్ణోగ్రత పెరుగడలతో వ్యక్తి మృతి చెందినట్లయితే వెంటనే వివరాలను సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలి. తహసీల్దార్, ప్రభుత్వ వైద్యాధికారి, ఎస్సై ఆ వ్యక్తి మృతి పట్ల విచారణ జరుపుతారు. వేర్వేరుగా పరిశీలన రిపోర్టులను రూపొందిస్తారు. బాధితుల దరఖాస్తుతో పాటు అధికారుల రిపోర్టులను తహసీల్దార్ కలెక్టర్‌కు పంపిస్తారు. కలెక్టర్ రిపోర్టులను పరిశీలించి వాస్తవంగా వడదెబ్బతోనే వ్యక్తి మృతి చెందినట్లయితే మృతుడి కుటుంబానికి రూ.4లక్షల పరిహారాన్ని అందజేశారు.

కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం

వడదెబ్బ కారణంగా ఎవరైనా మరణిస్తే సమాచారం అందించాలి. వైద్యుడి వద్ద నుంచి రిపోర్ట్ తీసుకుంటాం. అదేవిధంగా ఎస్సై కేసు వివరాలు మాకిస్తే కలెక్టర్‌కు పంపుతాం. ప్రజలు వడదెబ్బ పరిహారం గురించి అవగాహన పెంచుకోవాలి.

– ఎంఏ కలీమ్, నేరడిగొండ తహసీల్దార్

కొనుగోలు కేంద్రం సద్వినియోగం చేసుకోవాలి

బజార్‌హత్నూర్: మండల రైతులు జొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ గొడం నగేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ప్రారంభించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ జొన్నల కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, అందుబాటులో తాగునీరు, నీడ వసతి కల్పించాలన్నారు. దళారులు రైతుల పేరుపై అక్రమార్జనకు పాల్పడవచ్చని దళారుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్, చట్ల గజ్జయ్య, పరచ సాయన్న, దుబ్బుల చంద్రశేఖర్, లక్కం శంకర్, దీసీ రమణ, అల్కే గణేష్, చట్ల విలాస్, చిల్కూరి భూమన్న, రాజారాం, రాజు, శివుడు పాల్గొన్నారు.


జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక


లబ్ధిదారుల సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్


సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ రాజు

ఇచ్చోడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడుతున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. గురువారం మండలంలోని బోరిగామలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్లను, పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఎంపికైన జాబితా ప్రకారం.. గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక సర్వే పారదర్శకంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో జరుగుతున్న ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. సర్వే తీరును ఆరా తీయడంతో పాటు లబ్ధిదారులను గుర్తించడంలో పాటించాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. వార్డు ఆఫీసర్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ.. నిజమైన అర్హులకు జాబితాలో చోటు కల్పించేలా చూడాలని సూచించారు. పక్షపాత వైఖరి, పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

సభ విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహించే సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు మారుతి పటేల్ కోరారు. గురువారం మండల కేంద్రంలో డొంగ్రె కాంప్లెక్స్ వద్ద చలో వరంగల్ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు మహ్మద్ అంజాద్, జీలాని బేగ్, మడావి భీంరావ్, షేక్ సుఫీయన్, జాదవ్ ప్రకాష్, శివాజీ, ధరణి ధన్‌రాజ్ పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

సిరికొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల్లో నేడు యువతీ, యువకులకు ప్రతిభ ఫౌండేషన్ సంస్థ సహకారంతో సిరికొండ ఆర్‌ఎంపీ వైద్యుల ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆర్‌ఎంపీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు వివిధ కోర్సుల్లో శిక్షణతో కూడిన ఉద్యోగం కల్పన ఉంటుందన్నారు.

గంజాయి సేవించిన ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఎరోడ్రమ్‌లో గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్‌కు చెందిన ఉయిక దేవురావు, దస్నాపూర్‌కు చెందిన ముండే ఉత్తం, ఫిల్టర్‌బెడ్‌కు చెందిన కోడే శివాజీలు గంజాయి సేవిస్తుండగా పట్టుబడ్డారు. వీరికి గంజాయి పరీక్షలు చేయగా పాజిటివ్ వచ్చింది. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లుగా సీఐ పేర్కొన్నారు.

అర్హులనే గుర్తించాలి

ఖానాపూర్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని జెడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. మండలంలోని దిలావర్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో గురువారం జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు, గ్రామస్తులు ఉన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సాత్నాల బస్టాండ్ వద్ద గురువారం ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పవార్ సిద్దార్థకు డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు చేయగా పాజిటివ్ వచ్చింది. ట్రాఫిక్ పోలీసులు ఆటోను పక్కన పెట్టి ఎవరినైన సహాయకులను తీసుకువచ్చి ఆటోను తీసుకెళ్లాలని సూచించారు. కాగా సదరు ఆటో డ్రైవర్ ఒంటిపై డిజిల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడ్డాడు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆయనపై వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేయగా ఆత్మహత్య కేసుతో పాటు డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: రోజుల కిందట విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ కాలేజ్ ఆదిలాబాద్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో అశ్విన్ 964 మార్కులు, ద్వితీయ సంవత్సరం బైపీసీలో ప్రకాశ్ 968 మార్కులు సాధించారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో కళ్యాణ్ 470 మార్కులకు 453, బైపీసీలో ప్రకాష్ 440కు 417 మార్కులు సాధించారు. పాఠశాల స్థాయి నుంచి చదువులో రాణిస్తున్న ఈ విద్యార్థులు కళాశాల స్థాయిలోను ఉన్నత మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్ కాంబ్లే తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

నేడు ఇసుక వేలం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): భోరజ్ మండలంలోని పెండల్‌వాడ, డొల్లార గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక ఇటీవల సీజ్ చేయడం జరిగిందని భోరజ్ తహసీల్దార్ రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. భోరజ్ మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11.30 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

పని కల్పించాలని ధర్నా


ఆందోళన నిర్వహిస్తున్న కూలీలు

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన పలువురు కూలీలు గురువారం గ్రామం వద్ద గల ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ధన్నూర్ గ్రామంలో చేపడుతున్న జొన్న కొనుగోళ్లలో హమాలీ పని చేసేందుకు తమకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కేవలం బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలకు మాత్రమే హమాలీ పని చేయడానికి అధికారులు అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు. ధర్నాకు దిగడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న కూలీలతో మాట్లాడారు. పంట కొనుగోళ్లలో పని చేసేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకు విరమించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని ఖాప్రి గ్రామంలోని నూతన మహంకాళి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. ఈ సందర్భంగా గణపతిపూజ, యజ్ఞం, నిత్య అగ్నిహోత్రం, కలశ స్థాపన, యంత్ర స్థాపన, మూర్తి స్థాపన నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై పూజలు చేశారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం నిత్య అగ్నిహోత్రం, కలశ స్థాపన, యంత్ర స్థాపన, మూర్తి స్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.12లక్షలతో ఆలయాన్ని నిర్మించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

పుస్తెమట్టెలు అందజేత

ఖానాపూర్: మండలంలోని గోడలపంపు ఎస్సీ కాలనీకి చెందిన కొత్తూరు లక్ష్మి–నర్సయ్య దంపతులకు నలుగురు కూతుళ్లు ఉన్నారు. వచ్చేనెలలో రెండో కూతురు మానస వివాహం జరగనుంది. యువతి తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో పట్టణానికి చెందిన ఓకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఒడ్డెపల్లి అనుజ్ఞ–కృష్ణంరాజు దంపతులు గురువారం యువతికి పుస్తెమట్టెలతోపాటు చీర అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని ఇచ్చోడతండా, గుబ్బ గ్రామాల్లో గురువారం పశువైద్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువైద్యశాఖ అందచేస్తున్న ఉచిత సామూహిక గాలికుంటు నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాఖ చంద్రశేఖర్ రావు కోరారు.